## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ**



సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ దళితులకు ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసి.. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆదివారం హైదర్‌గూడలోని మాలిక్ చాంబర్‌లో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. నమ్మకంతో ప్రజలు ఓటు వేశారని, వారి ఆశలను వమ్ముచేయొద్దని అన్నారు. విద్యకు బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి.. ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ మాట్లాడుతూ.. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న దళితుల కోసం నూతన ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా సంక్షేమం, అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం.. సీఎం అధ్యక్షతన హైపవర్ కమిటీ వేసి ప్రతి ఆరునెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని సూచించారు. అంబేద్కర్ భరోసా పథకాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గృహనిర్మాణ పథకానికి మార్గదర్శకాలు విడుదల చేయాలని అన్నారు. ఎస్సీల రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచుతామనే హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బామ్‌సేఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ కుమార్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబాషి సంజీవ్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, బీవీఎం కార్యదర్శి రవితేజ, సతీశ్, నవీన్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్‌కు అలవాటుపడి.. డ్రగ్స్ విక్రయాన్ని వ్యాపారంగా మార్చుకున్న ఒక ముఠాను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితికా పంత్ కథనం ప్రకారం.. గోల్కొండ సెవన్ టూంబ్స్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ముజఫర్ అలీ, టోలిచౌకి నివాసి అబుబాకర్ బిన్ అబ్దుల్ అజీజ్ స్నేహితులు. ఇద్దరూ డ్రగ్స్‌కు అలవాటు పడ్డారు. ఆ తర్వాత ఇద్దరు కలిసి ఈజీగా డబ్బు సంపాదించాలని ప్లాన్ చేశారు. వీరిద్దరి స్నేహితుడైన టోలిచౌకి నివాసి మహ్మద్ ఖాసీంకు రూ.80 వేలు ఇచ్చి.. ఆంధ్రప్రదేశ్‌లోని పాడేర్‌కు పంపించారు. అక్కడ ఖాసీం లీటర్ హాష్ ఆయిల్‌ను కొనుగోలుచేసి తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ ఆయిల్‌ను సోమాజిగూడలోని సయ్యద్ ముర్తుజా అలీ ఇంటికి తీసుకువచ్చి.. అక్కడే అడ్డాను ఏర్పాటు చేసుకొని, 5 మిల్లీ లీటర్ల ఆయిల్‌ను ఒక్కో బాటిల్‌లో నింపుతున్నారు. ఒక్కో బాటిల్‌ను రూ.2 వేల చొప్పున సబ్ ఏజెంట్లకు సరఫరా చేస్తున్నారు. ఈ ముఠా వద్ద టోలిచౌకి, మాదాపూర్ ప్రాంతాలకు చెందిన సయ్యద్ ముర్తుజా అలీ హుస్సేన్, జీషాన్ నవీద్, సయ్యద్ అన్వరుల్లా హుస్సేనీ ఖాద్రీ, నితిన్‌గౌడ్, పూనమ్ కుమారి కౌర్ సబ్ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ.. హాష్ ఆయిల్ ఒక్కో బాటిల్‌ను రూ.3 వేలు, చారస్‌ను అవసరమైన వారికి విక్రయిస్తూ డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ ఫాషా బృందం ఈ ముఠాను అరెస్ట్ చేసింది. ఈ ముఠా నుంచి 310 మిల్లీ లీటర్ల హాష్ ఆయిల్, 70 గ్రాముల చారస్, ఒక ద్విచక్ర వాహనం, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు తదుపరి విచారణ బాధ్యతలను ఫిలిమ్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

## స్నేహితురాలి డబ్బులు కాజేస్తున్న యువకుడు

**సీసీ కెమెరాతో పట్టుకున్న యువతి**

బంజారాహిల్స్, డిసెంబర్ 10: స్నేహితురాలు దాచుకున్న నగదును తస్కరిస్తున్న యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబర్- 12, రాక్ రూఫ్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న పూజా రామ్‌టేక్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నది. అదే ఫ్లాట్‌లో చక్రవర్తి కూడా ఉంటున్నాడు. కాగా, పూజ పనిచేసే సంస్థలోనే ఉద్యోగం చేసే సత్యనారాయణ సాయి రజత్ అనే వ్యక్తి అప్పుడప్పుడూ ఫ్లాట్‌కు వస్తుండేవాడు. కొంతకాలంగా పూజ కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బులు మాయమవుతున్నాయి. దీంతో రహస్యంగా సీసీ కెమెరాను గదిలో పెట్టించింది. ఇటీవల కిడ్డీ బ్యాంక్‌లో రూ.15వేల నగదు దాచిన పూజ ఆఫీసుకు వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా డబ్బులు మాయమయ్యాయి. సీసీ కెమెరాలను పరిశీలించగా.. సత్యనారాయణ సాయి రజత్ డబ్బులు తస్కరిస్తున్న విషయం బయటపడింది. కొన్ని నెలలుగా రూ.1.50 లక్షల నగదును తస్కరించిన సాయి రజత్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పూజ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# చిన్నారులపై చలి పులి

- పెరుగుతున్న జలుబు, దగ్గు, జ్వర బాధితుల సంఖ్య
- మళ్లీ విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- నవజాత శిశువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి..
- నిలోఫర్ వైద్యులు

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా గత మూడు నాలుగు రోజుల నుంచి వణికిస్తున్న చలి.. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఈ చలి వల్ల వివిధ రకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. చలి ప్రభావంతో మరోసారి సీజనల్ వ్యాధులు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం కేసులు పెరుగుతున్నాయి. అయితే, చలి వల్ల చిన్నపిల్లలు న్యుమోనియా వంటి వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నట్లు వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

### చల్లదనంతో తప్పని సీజనల్..

వర్షాకాలం, చలికాలంలో సీజనల్ వ్యాధులు రావడం సర్వసాధారణం. వర్షాలు తగ్గిన తరువాత కొంత తగ్గుముఖం పట్టిన సీజనల్ వ్యాధులు.. కొన్ని రోజులుగా పెరిగిన చలి తీవ్రత కారణంగా మరోసారి పెరుగుతున్నాయి. చల్లదనం వల్ల జలుబు, జ్వరం వంటి కేసులు ఎక్కువగా వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీంతో పాటు వైరల్ ఫీవర్ కేసులు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయని నిలోఫవర్ వైద్యులు తెలిపారు. ఫలితంగా రోగుల తాకిడి పెరిగినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

### చిన్నారులపై ప్రభావం..

కొన్ని రోజులుగా వాతావరణంలో ఏర్పడిన మార్పులు, ఒక్కసారిగా పెరిగిన చలి ప్రభావంతో చిన్నపిల్లల్లో జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. వారం రోజులుగా చాలా మంది పిల్లలు ఈ సమస్యలతో ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలకు క్యూ కడుతున్నారు. నిలోఫర్ దవాఖానలో సైతం జలుబు, దగ్గు, జ్వరం.. సంబంధించిన ఓపీ కూడా పెరిగినట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి. సాధారణ రోగుల కంటే సుమారు 20 శాతం వరకు జలుబు, దగ్గు, జ్వరం కేసులు పెరిగినట్లు నిలోఫర్ వర్గాలు వెల్లడించాయి.



### నవజాత శిశువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి..

చలికాలంలో చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. చలికాలం వచ్చిందంటే సాధారణంగా చాలా మంది పిల్లల్లో జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు కనిపిస్తుంటాయి. ప్రతి సీజన్‌లో నిలోఫర్‌కు సైతం ఈ లక్షణాలతో వచ్చే కేసుల సంఖ్య సాధారణ రోజుల కంటే 15 నుంచి 20 శాతం పెరుగుతుంది. చలికాలంలో ఇది సాధారణమే అయినప్పటికీ చిన్నపిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా నవజాత శిశువుల విషయంలో చాలా జాగ్రత్త అవసరం. లేకపోతే ప్రాణాలకే ప్రమాదం. శిశువులను వెచ్చని వాతావరణంలో ఉంచాలి. చేతులకు గ్లౌస్‌లు, కాళ్లకు సాక్సులు, తలకు టోపీ వంటివి ధరించడమే కాకుండా.. శిశువుల గది వెచ్చగా ఉండే విధంగా జాగ్రత్త పడాలి. శిశువులను తీసుకుని చలి వాతావరణంలో బయటకు వెళ్లకపోవడం మంచిది. అధిక చలి వల్ల శిశువులు హైపర్ థెర్మియా బారిన పడే ప్రమాదం ఉంది. దీని బారిన పడకుండా ఉండాలంటే శిశువులకు తరచూ తల్లి పాలు పట్టాలి. చలి కాలంలో.. ముఖ్యంగా నవజాత శిశువులు, తక్కువ బరువు, నెలలు నిండకుండా జన్మించిన శిశువులను జాగ్రత్తగా చూసుకోవాలి. వీరికి చలి వల్ల ఎక్కువ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇలాంటి కేసులను ఎదుర్కొనేందుకు, మెరుగైన వైద్యం అందించేందుకు నిలోఫర్‌లో ప్రత్యేకంగా కంగారు మదర్ కేర్ (కేఎంసీ) వార్డును అందుబాటులో ఉంచాం. దీని వల్ల బేబీ శరీరం సహజంగా వెచ్చబడుతుంది. ప్రస్తుతం నిలోఫర్‌లో 20 పడకలతో కేఎంసీ వార్డు అందుబాటులో ఉంది. సేవలను అందిస్తున్నాం.

*– డాక్టర్ ఉషారాణి, సూపరింటెండెంట్, నిలోఫర్ హాస్పిటల్*

## డామిట్ 'కథ' అడ్డం తిరిగింది

- దారి దోపిడీ అంటూ కట్టుకథలు
- పోలీసుల వద్ద నుంచి డబ్బులు వసూలు
- ఎన్‌ఆర్‌ఐ అంటూ బురిడీ కొట్టిస్తున్న కేటుగాడు

బంజారాహిల్స్, డిసెంబర్ 10: తాను విదేశాల నుంచి వచ్చానని.. తనవద్ద నుంచి ఆటో డ్రైవర్లు విదేశీ కరెన్సీతో పాటు ఖరీదైన వస్తువులు చోరీ చేశారు.. అంటూ మధురానగర్ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు ఇచ్చి బురిడీ కొట్టించాడో యువకుడు. గతంలోనూ పోలీసులను ఇదే విధంగా మోసం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల కథనం ప్రకారం.. గోవాకు చెందిన సబీ డిసిల్వా ఈనెల 8న అర్ధరాత్రి మధురానగర్ పీఎస్‌కు వచ్చాడు. తాను బెల్జియం నుంచి వచ్చానని, సీఎం రేవంత్‌రెడ్డిని చూసేందుకు జూబ్లీహిల్స్‌కు వెళ్లి.. అక్కడి నుంచి ఆటోలో రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న క్రమంలో యూసుఫ్‌గూడ సమీపంలోని జానకమ్మ తోట వద్దకు తీసుకువెళ్లిన ఆటోడ్రైవర్లు తనవద్ద నుంచి 1200 యూరోలతో పాటు ల్యాప్‌టాప్, మొబైల్, తదితర వస్తువులను లాక్కుని దాడికి చేశారంటూ ఫిర్యాదు చేశాడు. ఇంగ్లిషులో మాట్లాడాడు. అతడి మాటలు నమ్మిన మధురానగర్ పోలీసులు.. ఐపీసీ 394 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, తనవద్ద చార్జీలకు కూడా డబ్బులు లేవంటూ పోలీసుల వద్ద నుంచి రూ.1000 వసూలు చేసుకుని వెళ్లిపోయాడు. ఘటనా స్థలంతో పాటు ఇతర ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలు పరిశీలించగా.. అలాంటి ఘటన అక్కడ జరగలేదని తేలింది. ఇదిలా ఉండగా.. తమకు ఫిర్యాదు చేసిన సబీ డిసిల్వా ఫోన్‌కు కాల్ చేయగా పనిచేయలేదు. దీంతో అతడి గురించి వాకబు చేయగా.. పలు విషయాలు బయటకు వచ్చాయి. గతంలో కూడా జూబ్లీహిల్స్, భువనగిరి తదితర ప్రాంతాల్లో ఇదే విధంగా తన పర్సును కొట్టేశారని, వస్తువులు చోరీ చేశారంటూ.. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి అక్కడి పోలీసుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తేలింది. రెండ్రోజుల కిందట జూబ్లీహిల్స్ రోడ్ నం. 10లోని డైమండ్ హౌజ్ సమీపంలో ఉన్న ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకుంటున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.10వేలు తీసుకుని ఉడాయించినట్లు బాధితుడు ఆదివారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడి కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలిస్తున్నారు.

## కాచిగూడ నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కాచిగూడ నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి సీహెచ్. రాకేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచిగూడ నుంచి కొల్లాయం, కొల్లాయం నుంచి కాచిగూడ వరకు డిసెంబర్ 18, 25, జనవరి 1, 8, 15 తేదీల్లో కాచిగూడ నుంచి కొల్లాయం, డిసెంబర్ 20, 27, జనవరి 3, 10, 17 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వెల్లడించారు.

## కొనసాగుతున్న గురుకులాల క్రీడా పోటీలు

మేడ్చల్, డిసెంబర్ 10: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల తొమ్మిదవ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు కిష్టాపూర్‌లోని గురుకుల పాఠశాలలో రెండవ రోజు ఘనంగా జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో 1050 మంది బాలికలు పోటాపోటీగా పాల్గొంటున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ గురుకులంలో అథ్లెటిక్స్, ఖోఖో, క్యారమ్స్ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ పోటీలను హైదరాబాద్ ఈస్ట్, రంగారెడ్డి రీజినల్ కో ఆర్డినేటర్ నాగ కళ్యాణి, జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా నాగ కళ్యాణి మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి.. ఉన్నత శిఖరాలు అధిరోహించేలా క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ క్రీడల ఇన్‌చార్జి రూతుమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభావతి, టెక్నికల్ మేనేజర్ రత్నపుష్ప, కిష్టాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



కిష్టాపూర్ గురుకుల పాఠశాలలో జరుగుతున్న జోనల్ క్రీడాపోటీల్లో క్రీడాకారులు

## కోరిక తీర్చలేదని.. మహిళ పై దాడి

*యూసుఫ్‌గూడలో దారుణం*

వెంగళరావునగర్, డిసెంబర్ 10: ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ పై కన్నేశారు. కోరిక తీర్చాలని వేధించారు. ఎదురు తిరిగిన మహిళపై దాడికి పాల్పడ్డారు. మహిళ ముఖంపై రాయితో కొట్టి గాయపర్చారు. ఈ దారుణం మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యూసుఫ్‌గూడ బ్రహ్మశంకర్ నగర్‌కు చెందిన వివాహిత (38) వంట పనులు చేస్తుంది. శుక్రవారం రాత్రి యూసుఫ్‌గూడ కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగి.. నడుచుకుంటూ ఒంటరిగా ఇంటికి బయలు దేరింది. ఆమెను ముగ్గురు కామాంధులు వెంబడించారు. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్ సమీపంలో ఆమె చేయిని పట్టుకుని లాగారు. కోరిక తీర్చాలంటూ ఆమెను బెదిరించారు. తాను అలాంటిదాన్ని కాదని చెబుతున్నా.. ఆమెపై వారు దాడికి పాల్పడ్డారు. మహిళ ముఖంపై రాయితో విచక్షణా రహితంగా దాడిచేసి, తీవ్రంగా గాయపర్చి పరారయ్యారు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్పృహలోకి వచ్చిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.